ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

నేడు జెవిడి నిధులు జమ

ప్రజాశక్తి-పార్వతీపురం

జగనన్న విద్యా దీవెన పథకం కింద 2022-23 త్రైమాసికానికి సంబంధించి 16,033 మంది విద్యార్థులకు రూ.10,40,93,202 కోట్లు శుక్రవారం తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. పార్వతీపురం నియోజకవర్గంలో 4,296 మంది విద్యార్థులకు రూ.3,04,78,459, కురుపాం నియోజకవర్గంలో 4,229 మంది విద్యార్థులకు రూ.2,58,82,964, పాలకొండ నియోజకవర్గంలో 4,304 మంది విద్యార్థులకు రూ.2,70,25,335, సాలూరు నియోజకవర్గంలో 3,204 మందికి రూ.2,04,07,444 .. మొత్తం 16,033 మంది విద్యార్థులకు 10,40,93,202 రూపాయలు జమ అవుతుంది.

పార్వతీపురంలో సమ్మె శిబిరంలో పోస్టుకార్డులు చూపిస్తున్న అంగన్వాడీలు

జిల్లాలో రోజురోజుకూ అంగన్వాడీల నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తున్నారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తున్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి పోస్టుకార్డులు రాశారు. మరోవైపు అంగన్వాడీల సమ్మెకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. సమ్మె శిబిరాలను టిడిపి, సిపిఎం, జనసేన నేతలు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు.

జగనన్నకో ఉత్తరం

- సిఎంకు పోస్టుకార్డులు పంపిన అంగన్వాడీలు
- డిమాండ్లు నెరవేర్చాలని విన్నపం
- 17వ రోజుకు నిరవధిక సమ్మె
- టిడిపి, సిపిఎం, జనసేన సంఘీభావం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె జిల్లాలో గురువారం 17వ రోజుకు చేరింది. యూనియన్ పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. సమ్మె శిబిరం వద్ద ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు రాసి పంపించారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిమాండ్‌చేశారు. యాప్‌ల పేరుతో పని భారాన్ని రద్దు చేయాలన్నారు. అంగన్వాడీల డిమాండ్లు ఆమోదించే వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీలకు యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మురళీమోహన్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావాల రమణారావు, యమ్మల మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఎపి ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి జిల్లా కన్వీనర్ బి.వి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ఎం.గౌరీ, బి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలో అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యాన ప్రాజెక్టు పట్టణ నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పోస్ట్ కార్డులను పోస్టాఫీసు వద్ద బాక్స్‌లో వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

సీతానగరం : తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, వై.రామారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రెడ్డి లక్ష్మి, వై.సత్యవతి, జి.సునీత పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎ ముఖద్వారం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, మండల నాయకులు బిడ్డిక పకీరు, బిడ్డిక జయప్రకాశ్, ఎ.ప్రకాశం సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కాంతారావు, సురేష్, అంగన్వాడీ సంఘం అధ్యక్ష, కార్యదర్శి పార్వతి, దర్శిమి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు సూకూరు అప్పలస్వామి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.ప్రభావతి, పైడిరాజు, బేగం, సత్యమంగ, నాగమణి పాల్గొన్నారు.

సాలూరు.. పోస్టుబాక్సులో కార్డులు వేసి సిఎంకు పంపిస్తున్న అంగన్వాడీలు

కురుపాం : మండల కేంద్రంలో అంగన్వాడీలు పోస్ట్ కార్డులు రాసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు గురువారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. వీరికి టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్‌రావు నాయుడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషవర్ధన్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో సమ్మె శిబిరంలో పోస్టుకార్డులు చూపిస్తున్న అంగన్వాడీలు

గడ్డి తింటూ నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

17 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కొమరాడలో గురువారం వినూత్నరీతిలో వారంతా నిరసన తెలిపారు. ప్లేట్లలో ఎండుగడ్డి, పచ్చిగడ్డి వేసుకుని తింటూ నిరసన తెలిపారు. అంగన్వాడీల ఆందోళనకు టిడిపి నాయకులు బిడ్డిక తమ్మయ్య, ఎం.వెంకటనాయుడు, బత్తిలి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిరికి అనురాధ, బి.అలివేలు, జ్యోతి, పద్మ, జయమ్మ, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్లేట్లలో గడ్డి వేసుకుని తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, మద్దతుగా పాల్గొన్న టిడిపి, సిఐటియు నాయకులు

వాలీబాల్ కొట్టి పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గెలుపోటములు సహజం

- క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి : డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర
- రాష్ట్ర స్థాయి గురుకులాల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పాచిపెంట

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర కోరారు. మండలంలోని పి.కోనవలస క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి గురుకులాల క్రీడా పోటీలను గురువారం డిప్యూటీ సిఎం రాజన్నదొర క్రీడా జ్యోతిని ప్రారంభించారు. ఈ పోటీలకు అండర్-17, 19 విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 40 జట్లు హాజరయ్యాయి. క్రీడల ప్రారంభం అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. విద్యార్థులు ఆటల్లో ఓడిపోయామని కుంగి పోకూడదని తెలిపారు. తాను కూడా మొదటిసారి ఎమ్మెల్యేగా ఓడిపోయానని కుంగి పోకుండా, న్యాయ పోరాటం చేసి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు విజయం సాధించానని గుర్తుచేశారు. రాష్ట్రంలో వరుసగా నాలుగు సార్లు గెలుపొందిన గిరిజన ఎమ్మెల్యే తానేనని చెప్పారు. పి.కోనవలసకు స్పోర్ట్స్ పాఠశాల, డిగ్రీ కాలేజీ తీసుకురావడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, సర్పంచ్ కె.మంగమ్మ, ఎంపిటిసి సభ్యులు తోకల లక్ష్మి, ఎం.రమణమూర్తి, గురుకులాల ప్రిన్సిపల్స్, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న క్రీడాకారిణులు

సాగునీటి కోసం 30న ధర్నా

ప్రజాశక్తి -గరుగుబిల్లి

రబీ సాగుకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా నీరందించాలని ఈ నెల 30న ఖడ్గవలస కూడలిలో ధర్నా చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు తెలిపారు. గురువారం మండలంలోని ఖడ్గవలస కూడలిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువల ద్వారా రబీ పంటకు నాలుగేళ్లుగా నీరు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆధునికీకరణ పేరు చెప్పి పనులు ప్రారంభిస్తామని చెప్పడమే గాని పనిచేసిన దాఖలాలు లేవన్నారు. ప్రాజెక్టు నిండా నీరున్నా సముద్రం పాలు చేస్తున్నారు గాని రైతులకు నీటిని విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత స్పందనలో ఆరుతడి పంటలకు నీరు విడుదల చేయాలని కోరినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. దీంతో రైతులతో కలిసి చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పురుషోత్తమ నాయుడు, అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.బి.విజయ అంకుశం, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు, తెలుగు యువత అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కోట సుమన్ భరత్ పాల్గొన్నారు.

నేడు గ్రూప్-1, 2 పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

విద్యార్థులకు గ్రూప్-1,2 పరీక్షలపై ఆసక్తిని పెంచి అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ, మండల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవోదయ మోడల్ టెస్టుకు ఆహ్వానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలోని తిరుమల సాయి ఉన్నత పాఠశాలలో జనవరి 7న నవోదయ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రతి విద్యార్థి తన ప్రతిభా సామర్థ్యాలు చూపించడానికి, సీటు సంపాదించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150.. జనవరి 4లోగా చెల్లించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎమ్మెల్యేలు, కలెక్టర్

జనవరి నుంచి రూ.3 వేలు పింఛను

ప్రజాశక్తి-పార్వతీపురం

జనవరి ఒకటో తేది నుంచి మూడు వేల రూపాయలు వైఎస్ఆర్ పింఛను కానుకగా అందించనున్నట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్ఆర్ పింఛను కానుక, చేయూత, ఆసరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర పథకాల అమలపై సిఎం సమీక్ష నిర్వహించారు.లా కార్యక్రమాల కోసం ముందుగానే షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని షెడ్యూల్‌ని రూపొందించాలని ఆదేశించారు. జనవరి ఒకటి నుంచి 8వ తేదీ వరకు వైఎస్ఆర్ పింఛను కానుక కింద కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జనవరి 23 నుంచి 31వ తేదీ వరకు వైఎస్ఆర్ ఆసరా, ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభిస్తామని, చేయూత కింద 5 నుంచి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, కలెక్టర్ నిశాంత్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విఆర్‌ఎల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి-పార్వతీపురం

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ముందుగా పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒ జె.వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు, జి.కృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే విఆర్‌ఎల సమస్యలు పరిష్కరిస్తామని సిఎం జగన్ హామీనిచ్చారని గుర్తుచేశారు. సమస్యలపై అనేక మార్లు నిరసనలు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు గడిచినా ఎటువంటి స్పందన లేదనీ విమర్శించారు. పేస్కేల్‌తో పాటు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. అర్హతలను బట్టి అటెండర్, వాచ్‌మేన్, కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. 65 ఏళ్లు దాటి మరణించిన వారి కుటుంబంలో ఒకరికి కంపాస్నేట్ కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. పెంచిన రూ.500 డిఎ జిఒను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులపై

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆగ్రహం

నోటీసు ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమ్మెలో ఉన్న కారణంగా కెజిబివి సిబ్బందికి అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం పట్ల సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం తొమ్మిదో రోజుకు చేరింది. ఈ మేరకు జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పార్వతీపురం చర్చి జంక్షన్‌లో నోటీసు ప్రతులను దగ్ధం చేసి నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు భారతి, ఈశ్వరరావు, లక్ష్మణరావు, బివి రమణ మాట్లాడుతూ జిల్లాలో 59 మంది కెజిబివి ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను జిల్లా అధికారులు ఇచ్చారని, ఇది ఉద్యోగులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం చర్చలకు సిద్ధపడకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ఇచ్చిన జిఒను కూడా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కెజిబివి సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చి భయభ్రాంతులకు గురిచేసే దుర్మార్గమైన చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంతానికి పోకుండా సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి నాయకులు రమేష్, భానుప్రకాశ్, సింహాచలం, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసు ప్రతులు దగ్ధం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మాజీ సైనికులు సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అన్ని చర్యలూ తీసుకుంటామని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో డిఆర్‌ఒ అధ్యక్షతన జిల్లా సైనిక బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ మాట్లాడుతూ జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమం కోసం జిల్లా సైనిక బోర్డు పలు ప్రతిపాదనలు చేసిందన్నారు. వాటిలో మాజీ సైనికుల సంఘం కార్యాలయ నిమిత్తం భూమి మంజూరు, మాజీ సైనికులకు, వితంతు మాజీ సైనికులకు 250/175 చదరపు గజాల ఇళ్ల స్థలాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కేటాయింపు, త్రివిధ దళాలలో విధి నిర్వహణలో మరణించిన సైనికుల భార్యలకు, వారి ఆధారతులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత, తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడారు. ఈ సమావేశంలో చైర్మన్, రిటైర్డ్ కల్నల్ శ్రీరాములు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా సైనిక బోర్డు సభ్యులు కోరాడ నారాయణ, బోటు రామకృష్ణ, వి.కృష్ణ, వెలగ రామారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటరావు

వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

కనీస వేతనాలు ఇవ్వాలని ఆశాల ధర్నా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కనీస వేతనాలు ఇవ్వాలని గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు ధర్నా చేశారు. సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి. శంకరరెడ్డి పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే ఉపాధి పనులు

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు కొలతల ప్రకారమే చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వలసల నివారణకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. ఉపాధి హామీలో పనులు కల్పించి కనీస వేతనాలు ఇస్తే వారు కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే కొత్త పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. అనంతరం ఎపిఒ బాలకృష్ణ మాట్లాడుతూ మేట్ల విధులు, బాధ్యతలు, యాప్ హాజరులో జాగ్రత్తలు, కూలీల హక్కులు, జాబ్ కార్డు, మస్టర్ సక్రమ నిర్వహణ, ముందస్తు కొలతలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ డి.జగన్నాథ నాయుడు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ మేట్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఎపిడి ఒఎన్ రమేష్ రామన్న మాట్లాడుతూ ఎంఎంఎస్ రికార్డులు, జాబు కార్డులు, వేతన దారులపైన ఈ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎం ప్రసాద్, ఎపిఒ ఎన్.భాను, ఇసి కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు

ప్రజాశక్తి -భామిని

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించి, కార్పొరేట్ తరహా విద్యను అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయమని జెసిఎస్ మండల కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తెలిపారు. భామిని మండలంలో బాలేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థులకు 39 ట్యాబులు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ట్యాబులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం జామి రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.చలపతిరావు, ఎంపిటిసి ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎఎస్ఐ సురేష్, హెచ్‌సి కృష్ణమూర్తి

మానవత్వం చాటుకున్న హెచ్‌సి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధమిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలో పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలోని జగన్నాథపురంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న కొమ్ము సాత్విక్ నవోదయ పరీక్షల్లో ఆరో ర్యాంకు సాధించాడు. విజయనగరం జిల్లా తాటిపూడి నవోదయ పాఠశాలలో చేరేందుకు గురువారం ఆఖరి రోజు. తండ్రి కొమ్ము చంటిబాబు వికలాంగుడు. దీంతోపాటు డబ్బులు లేకపోవడంతో పాఠశాలలో సాత్విక్ చేరడానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విషయం కృష్ణమూర్తి తెలుసుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ సురేష్ కుమార్ చేతుల మీదుగా రూ.2 వేలను ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో పలువురు హెచ్‌సి కృష్ణమూర్తిని అభినందించారు.

ఒడిశా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఆర్ట్ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు

మండ వాటర్‌షెడ్ సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

ఆర్ట్ సంస్థ ద్వారా సమీకృత వ్యవసాయ విధానం వల్ల మంచి ఆదాయం లభిస్తుందని ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. మండలంలో మండలో ఆర్ట్ సంస్థ ద్వారా నిర్మించిన వాటర్ షెడ్‌ను ఒడిశా రాష్ట్ర రైతుల బృందం సందర్శించింది. చిరుధాన్యాలు, నేల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయానికి సన్యాసిరావు అవగాహన కల్పించారు. జీవామృతాలు, కషాయాల యాజమాన్య పద్ధతులు, నీటి సంరక్షణ గురించి తెలియజేశారు. అనంతరం గూడ కసిమి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాబు, ప్రసాద్ మిశ్రా, దిలీప్‌కుమార్, మన్య సహజ సిఇఒ బి.శంకర్‌రావు, ధనరాజ్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని శివరాంపురంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులను గురువారం ఎంపిడిఒ గొట్టిపల్లి పార్వతి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జరజాపు మోహన్, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎస్ఇబి కార్యాలయం వద్ద ఈ నెల 30న మూడు ద్విచక్ర వాహనాలు వేలం వేస్తున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ బి.వి.నాగభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్పెండర్ ప్లస్ -2, బజాజ్ సిటి -1 వాహనాలు వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా ఎస్ఇబి కార్యాలయానికి వచ్చి రూ.2 వేలు చెల్లించి, ఆదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

చెవిలో పూలు పెట్టొద్దు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన • మూడో రోజుకు సమ్మె

పార్వతీపురంలో చెవిలో పూలు పెట్టుకుని భజన చేస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

సమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో కార్మికులు వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. చెవిలో పూలు పెట్టొద్దని భజన పాటలు పాడుతూ నిరసన చేపట్టారు. వీరికి పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి పాకల సన్యాసిరావు సిఐటియు నాయకులు బి.వి.రమణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగవంశం శంకర్రావు, పట్టణ అధ్యక్షులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ, పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు పాల్గొన్నారు.

సాలూరు : మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు చేతులతో కళ్లు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షులు ఎస్ఎఫ్ అహ్మద్ ఆధ్వర్యాన ఉద్యోగులు సందర్శించి, మద్దతు పలికారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు, టి.ఇందు, పోలరాజు పాల్గొన్నారు.

సాలూరు.. మోకాళ్లపై నిలబడి కళ్లు మూసుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, సిఐటియు నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

నేటి నుంచి సమ్మెలోకి వెళ్తాం

- స్పష్టంచేసిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది
- ఆలోచించాలన్న కమిషనర్

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో తాగునీరు సరఫరా, విద్యుత్తు విభాగంలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్తామని.. కమిషనర్ జె.రామఅప్పలనాయుడుకు స్పష్టంచేశారు. గురువారం సిఐటియు నాయకులను, ఇంజినీరింగ్ విభాగం కార్మికులను మున్సిపల్ కమిషనర్ చర్చలకు ఆహ్వానించారు. దీంతో కమిషనర్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావుతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సమ్మెపై పునరాలోచించాలని కోరారు. ఇప్పటికే పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారని తెలిపారు. వాళ్లతోపాటు మీరు కూడా సమ్మెలోకి వెళితే పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలలో ప్రధానమైన తాగునీటి సరఫరాకు అవకాశం ఉండదని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలని కోరారు. ఏళ్ల తరబడి తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే సమ్మె చేస్తున్నామని ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది తెలిపారు. సమ్మెకు సహకరించాలని కమిషనర్‌ను కోరుతూ అక్కడి నుంచి వెనుదిరిగారు.

వైసిపి పాలనలో అందరికీ అన్యాయం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

పాచిపెంట.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

రాష్ట్రంలో వైసిపి పాలనలో అన్ని వర్గాల వారికి అన్యాయమే జరుగుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. మండలంలోని రాయిగుడ్డివలస పంచాయతీలోని పలు గ్రామాల్లో గురువారం బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సామాన్యుడి జీవనం కష్టతరంగా మారిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు అందరికీ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, ముఖి సూర్యనారాయణ, పల్లేడ ఉమామహేశ్వరరావు, కొత్తల పోలినాయుడు, కె.సురేష్, పి.నరిసింగరావు, దండి మోహన్ రావు, పల్లేడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో శంభాం పంచాయతీ పరిధిలో జిల్లేడుపాడు గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ వాడుకునే వదిలేయడం జగన్ రెడ్డి నైజమని, సొంత ప్రయోజనం కోసం ఎవరినైనా బలిపెట్టడం ఆయన లక్షణమని విమర్శించారు. విశ్వసనీయత లేని వ్యక్తి జగన్ రెడ్డి అని, వైసిపి 57 నెలల పాలనలో ప్రజలకు ఈ విషయం స్పష్టమైందని తెలిపారు. ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం చేశారని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సీనియర్ నాయుకులు నిమ్మక నాగేశ్వరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిమ్మక చంద్రశేఖర్, ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, నిమ్మక చిన్నారావు, అరిక భూషన్, వార్డ్ సభ్యులు కుండంగి బుల్లయ్య, పాలక ఆదినారాయణ, కుంబిరిక రామారావు, పాలక లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : వైసిపి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందని, టిడిపి అధికారంలోకి రావాలని ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర తెలిపారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం వైకెఎం కాలనీలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తమ పార్టీకి ప్రజల్లో ఎనలేని ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బార్నాల సీతారాం, కోల సత్యనారాయణ, కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

ఫిష్ ఆంధ్ర డెయిరీ ప్రారంభం

ఫిష్ ఆంధ్ర డెయిరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

ఫిష్ ఆంధ్ర డెయిరీని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు. గురువారం మండలంలో గుమ్మ పంచాయతీ కోనగూడ గిరిజన గ్రామంలో పాలక రాహుల్‌కు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.10 లక్షలతో మంజూరైన ఫిష్ ఆంధ్ర డెయిరీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా గిరిజన ప్రాంతంలో ఫిష్ ఆంధ్ర డెయిరీ మంజూరైందని తెలిపారు. దీనికి ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా 60 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. మూడేళ్ల తర్వాత ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా 30 శాతం బ్యాంకు నుంచి సబ్సిడీ విడుదల అవుతుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, మత్స్యశాఖ డివిజనల్ అభివృద్ధి అధికారి డి.గోపీకృష్ణ, డిఆర్‌పి లక్ష్మి, మత్స్య శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

అందరికీ ఆరోగ్యశ్రీ లబ్ధి

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వచ్చే లబ్ధి అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ అందాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. గురువారం ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సి వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. దీనిపై ఆసుపత్రికి వచ్చే రోగులకు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చాలా గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన లేదని, అలాంటివారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు అందించే ప్రయివేట్ ఆసుపత్రుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్య మిత్రల సమాచారం ఆసుపత్రుల వద్ద ప్రదర్శించాలని ఆదేశించారు. రోగులు ఆసుపత్రిలో చేరిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పార్వతీపురం మన్యం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశ్‌రావు, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పివిటిజి సర్వేను వినియోగించుకోవాలి

సీతంపేట : పిఎం జన్మాన్ పథకం కింద చేపడుతున్న పివిటిజి సర్వేను వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఎం జన్మాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం గృహాలను మంజూరు చేస్తుందని, అందుకు సంబంధించిన సర్వేను గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నారని తెలిపారు. ఇంతకుముందు ఇళ్లు మంజూరు కాని వారు తప్పనిసరిగా సర్వే చేయించుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామాలకు వచ్చి సర్వే చేపడుతున్నారని, దీనిని వినియోగించుకోవాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహనతో వ్యాధులు దూరం

డిహెచ్‌పిఒ టి.జగన్మోహనరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఆరోగ్యంపై అవగాహన ద్వారా పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. గురువారం పట్టణంలో వాసవి గాయత్రీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పి.వి.కె.మణికుమార్, ప్రిన్సిపల్ ఎంవిఎస్ శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై వివరించి అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి రోగ నిరోధక శక్తి ప్రామాణికమని, కరోనా వంటి వ్యాధులు ఎదుర్కోడంలో ఇది చాలా ఆవశ్యకమని చెప్పారు. పౌష్టికాహారం తీసుకుంటూ, ప్రతిరోజూ తగినంత శారీరక శ్రమ ఉన్నవాళ్లకి రోగనిరోధక వ్యవస్థ బాగుంటుందని చెప్పారు. రక్తహీనత వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు వివరిస్తూ కొద్దిపాటి శ్రమకే ఆయాసం రావడం, ఆకలి మందగించడం, కీళ్ళు, కండరాల నొప్పులు, చర్మం పాలిపోయినట్లు ఉండటం ఉంటాయని, వీటి నివారణకు క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయాలని సూచించారు. ఐరన్ లభ్యత ఉండే ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నవి, బెల్లంతో చేసినవి, ఖర్జూరం, ఆకు కూరలు, గుడ్డు తీసుకోవాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి ఆయన వివరిస్తూ శీతాకాలంలో శ్వాస సంబంధమైన వ్యాధులు సోకే అవకాశం ఉందని, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జన సమూహాల్లో ఉండేటప్పుడు మాస్క్ ధరించాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని, తద్వారా చర్మవ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి.పుష్ప, జయగౌడ్, కళాశాల ఎఒలు, అధ్యాపకులు వంగలి దాలినాయుడు, శ్రీనివాసరావు, వెంకటరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో బాలుర గురుకుల పాఠశాల, బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం పిఎంఆర్‌సి సిబ్బంది సందర్శించారు. సీతంపేట, భామిని మండలాలకు చెందిన తెలుగు, మేథ్స్, సైన్స్ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌లను ఎఎంఒ పి.కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ సందర్శించారు. ఈ నెల చివరికి సిలబస్ పూర్తిచేసి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని గోపాలపురం సర్పంచ్ పెండ స్రవంతి రమణ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చిన్నమ్ములు, రమేష్‌తోపాటు పలు కుటుంబాలు వైసిపిలో చేరాయి. గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో వీరికి పార్టీ కండువాలు వేసి, వైసిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొమ్మ రమేష్, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, మజ్జి చంద్రశేఖర్, బంకురు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతి అందిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

మా సమస్యలు పరిష్కరించండి

ఎంపిడిఒ ఎనర్జీ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-సీతానగరం

విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎనర్జీ అసిస్టెంట్లు ఉమామహేశ్వరరావు, ఎన్.జనార్దన మాట్లాడుతూ విధి నిర్వహణలో 142 మంది మరణించారని, 242 మంది గాయాలయ్యాయని చెప్పారు. వీరికి సెలవులు ఇవ్వడం లేదన్నారు. 24 గంటలూ పని చేస్తున్న తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఇఎలు వై.నరేష్, ఎ.కిరణ్, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

ప్రజాశక్తి-సీతంపేట


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్.నవీన్

తక్కువ సమయం ఉందని, ప్రణాళిక ప్రకారం చదివితే పదో తరగతిలో మంచి మార్కులు సాధించవచ్చని భారతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.నవీన్ అన్నారు. మండలంలో పులిపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు రెండున్నర నెలలు గడువు మాత్రమే ఉందన్నారు. ప్రతి నిమిషం విద్యార్థులకు విలువైందని చెప్పారు. సిలబస్ పూర్తయిందని నిర్లక్ష్యం చేయకుండా రివిజనింగ్ చేసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రేడింగ్ పద్ధతి అవలంబించి, సి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను ఎ గ్రేడ్‌కి తీసుకురావడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బోధకులు మురళీమోహన్, దివాకర్, సురేష్, మురళి, వెంకటేశ్వర్లు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.